అతని తప్పులేదు, అతని భార్య తప్పు అసలేలేదు. అయినా బాధకూ, అవమానానికీ గురయ్యారు. హింసంటే ప్రపంచానికి యిష్టమా ? భయమా ?

పగలే తెరచాటు జీవితం అయిన నగరం, దాంట్లోనూ దొంగబతుక్కి సన్నద్ధం అవుతోంది.

రాత్రి తొమ్మిదవుతూంది.

చిమ్మ చీకటిని రాచవీధుల్లో నియాన్ లైట్లు పొడుస్తున్నాయి.

"పురానాపూల్" చౌరస్తా యింకా పగటిలాగానే రష్‌గా వుంది.

గాంధీగారి బొమ్మ నాలుగురోడ్ల గరిమనాభిమీద నిలబడి వుంది. మిర్చీలూ, కట్లెట్లూ....గప్‌చిప్‌లూ....ఆకలికా, అవసరానికా...కాదు.

గుడుంబా పేగులు కాల్చకుండా తోడు పంపడానికి.

ఓ పక్కనే మురికికాల్వ యెలా వుందంటే దానిపక్కనే నిల్చొన్న వస్తువు తనే అయి గిరాకికోసం ఎదురుచూస్తున్న వో వ్యాపారస్తురాలిలా.

సిగ్గు లేకుండా....

టాప్ లేకుండా....

మూసీమీది చలి కంపుకొడుతోంది.

ఒక మూల పెట్రోలు బంకు చలి వేంద్రంలాగా పోజుకొడుతోంది. దూరంగా రోడ్ల కడ్డంగా నిలబడి బాతా

# వాడు-వాడి పెళ్ళాం

## శ్రీనివాస శ్రీవాత్సవ

ఖానీలు పేలుస్తున్నారు వృషభాలో.. బస్తీ వీరులో....

బస్సంటూ ఒకటి వచ్చి. ఆసాపులో ఆగితే.. ఆగాల్సిన చోటులో యిప్పుడు రెండు ఆటోలు. వో డజన్ రిక్షాలూ ముసిరినాయి. సేద తీర్చుకుంటున్నాయి.

పగటిపూట అయితే అవి అంత స్వేచ్ఛగా నిలబడలేవు. అక్కడ నిలబడితే "ఖట్‌మలోడు ఒస్తడు లాటీదింపుతాడు, గాలితీసి పార.... తడు."

పెట్రోలు బంకు యెదురుగా బస్టాపు అయితే పక్కనే పాండబ్బా. పాండబ్బా వెనక కొంచెం బంజరుభూమి. అంటే పుట్‌పాత్ దానిమీద వల్లీలబండి దాని పెగకు పక్కనే వో రిక్షా కాచుకుంటోంది.

ఆ రిక్షా "మానెయ్యది"

మానెయ్య పట్నంమీద పెట్టుకున్న ఆశలు పెగిలినట్లున్నాయి. "హయిదరాబాద్" చలికి మొహం పగిలింది.

ఈ రోజుటి చలికి "మానెయ్య" యెన్నడూ లేంది....కాకపోయినా ఎప్పుడో వొకసారి అయినటువంటి గొంతు తడుపుకున్నాడు కొంచెం రెస్టుతీసుకుంటున్నాడు.

అక్కడ కూచున్న గంటసేపట్లో ఎన్ని ఆలోచించాడు ! గమ్యాన్ని.... ఈరోజు దొరికిన ఆదాయానికి అన్వయించుకుని యెంత దగ్గరగా ఊహించాడు !

రిక్షా తొక్కవలసిన కష్టకాలాన్ని ఎంత తక్కువగా అంచనా వేసుకున్నాడు !

అమ్మో! పట్నం అనుకుని తనలవాటయిన నగరపు పోకడలకి తన్నితాను మెచ్చుకున్నాడు.


అమ్మో! గొంతు తడిపిన అమృతం యెన్ని ఆశలు చూపగలదు!!!

వల్లీలు తింటున్న ఓ మనిషిని అడిగాడు మానెయ్య.

"టేమ్ యేమయింది సార్ !"

"తొమ్మిది."

మానెయ్య డ్యూటీ అయిపోయినట్లే. కష్టార్జితంలోంచి గొంతు తడుపుడికి పోగా మిగిలింది గంజికో, నూకకో, రొట్టెకో



మొత్తానికి రేపటి భత్యానికి.

"ఏమన్నా! పోతన్నావ్" అని ఓ సహకార్మికుడు అడిగాడు.

"అవునన్నా! తొమ్మిదికే బండి యిచ్చేయాల."

"పో! పో!" సహకార్మికుడు వెచ్చటి పొగ వొదిలాడు.

మానెయ్య రిక్షా యిప్పుడు బస్టాపు మీదనే వుంది.

రిక్షా అక్కడ పెట్టి బీడీలకోసం పోయాడు. "పాండబ్బా అంటె యాడ అంగడే" అనుకున్నాడు మానెయ్య. పాన్

డబ్బా వాలా బిజీగా వున్నాడు. పది పైసల చేత్తో వెనగ్గా నిలుచున్నాడు మానెయ్య. వాదిగి నడుచుకోవడం. కొట్లాటలజోలికి పోకపోవడం మానెయ్య ఇంటిదగ్గర పెద్దల దగ్గర పొందిన కణోపదేశం !!

దూరంగా యేదో షాదీఖానాలోంచి పాట వినిపిస్తోంది డాన్ ! డాన్ డాన్ !

ఇద్దరు స్టూడెంట్లు రోడ్డు మీద సైకిళ్ళ మీద చెట్టాపట్టాలమీద పోతున్నారు మాటలు చప్పరిస్తూ "అబెయ్! డాన్ చూసినావ్‌ర" మానెయ్య బీడి వల్లీలబండిలో అంటుకుంది.

"నేపోతున్న" అనుకుంటూ రెండు కాయలు అందుకున్నాడు మానెయ్య !

"చూసింరా రెండునిముషాల దోస్తానికే కాయమీద చెయ్యిపడె" వల్లీలవాడు. కష్టమర్‌తో చెప్తున్నాడు. ఈ కామెంట్ విన్న చెవులకు సంబంధించిన చేతులు డబ్బులిస్తున్నప్పుడే అక్కడో గొడవ మొదలయింది !

* * *

జనం గుమిగూడారు గాంధి పుత్లిదగ్గర. "క్యాహువాభాయ్". "ఏమయిందిర భయి" ఈ గుసగుసలే. జనం మధ్యలో యెవడో యేడుస్తున్నాడు. పెద్దగా యేడుస్తున్నాడు. పెద్దవాడే ఏడుస్తున్నాడు. వో పహిల్వాన్ లాంటివాడు-కం పెద్దమనిషి లాంటివాడూ ఏడుస్తున్న వాడి గల్లాని విడిచి, వాణ్ని వొంచి, పొట్టలో గుభిక్కున తన్ని.... లేక పొడిచి అంతమంది జనాన్నీ అవలీలగా విదిలించి, ఓ రిక్షామీద కూచుని 'చల్ బే' అన్నాడు. రిక్షావాడు కిక్కురుమనకుండా కదిలాడు. ఆ రిక్షావాడు మానెయ్యకాదు. ఏడ్చేడివాడు "మానెయ్య". వల్లీల బండి వాడు ఊరడిస్తున్నాడు దూరంగా తన బండి మీద చూపు మరల్చుకోకుండానే.

"వూకోర భయి వూకో"

మానెయ్య చిన్నపిల్లవాడిలాగా ఏడుస్తున్నాడు. వయసును లెక్కించని బాధ పిండిన దుఃఖం. అతను ఇందాకట్నుంచి (సంస్కారం పొందిన భాషలో అయితే) "వృషణ ద్వయాన్ని" గట్టిగా పట్టుకుని యేడుస్తున్నాడు. వొదిలితే ప్రాణం పోతుందన్నంత నెప్పితో పట్టుకున్నాడు.

మాట్లాడనిచ్చేంత స్వేచ్ఛ నెప్పి ఇచ్చిన తరువాత 'మానెయ్య' తిడుతున్నాడు. ఆ కొట్టినవాడి అమ్మలు, అక్కలు, ఆలుల మీదనించి గాడిదలు, గుర్రాలు, పందులు, కుక్కలు.... సమస్త జంతుజలాన్నీ తోలాడు. "ముప్పది యేండ్లు పైబడిన వో దరిద్రుడు యేడ్చుచున్నాడనిగానీ ఈ జనమునకు యేమి ఆసక్తి ఈ ఘటన మీద."


ఆంధ్రజ్యోతి
సచిత్ర వార పత్రిక



కొత్త సీరియల్

పెళ్ళికాకముందు కన్నెపిల్లలు
కనే కలలు వేరు -
పెళ్ళయాక జీవితం వేరు!
ఆశనిరాశల ఊహల ఊయలలో
ఊగి ఊగి
అందమైన అర్థంకాని మగనితో
కాపురం చేసి
సంసార సాగరంలో కన్నీటిచుక్కలా
మునిగిపోయిన
మధ్యతరగతి మానవతి
మనసు విప్పి చెప్పుకున్న
ఓ కుటుంబ చరిత్ర

'సంసారవాహిని'

రచన
శ్రీమతి ఆదిమధ్యం రమణమ్మ

28-3-80 ఉగాది సంచిక నుంచి ప్రారంభం!


ఎవరో పెద్దమనిషికి కళ్ళలో కరుణ వాలికిపడితే అతనికి చెబుతున్నాడు మానెయ్య.

"శెదరఘాటు కాడుండుండె నా గుడిశె. గిప్పుడె బీడీలకిగా పాండబ్బాకాడి కెళ్ళిన. గింతలనే.. గిప్పుడు వోలే లమ్డికొడుకు.. దొరలెక్కొచ్చి కూసుండు రిబ్బామీద. శెప్పిన ! యింటికి పోవాలె దిగు అంటివి. చార్మినారంట ఈ పక్కవోణ్ణి పొమ్మంటె పోతా అంటుండు. దిగు పేటూ అన్న.

గింతనెనుండి నే అన్నది. దిగుదిగు తానె ఈడ.... నా ఆయం పట్టు మీద కొటేండు.. ఈళ్ళందరు సూస్తుంద్రిడి. వొక్కడు.... యేందిది అన్లే."

మా నె య్య తి టూ చె ప్త న్నా డు. ఓమేస్తూ చెప్తన్నాడు. యేడుసూ చెప్తన్నాడు. జనం వల్చబడుతున్నారు. కథ అడిగి వింటున్న పెద్దమనిషి కదలలేదు! బస్సుకోసం కాబోలు:

పాండబ్బావాడూ.

పల్లీల బండివాడు.

పెట్రోలు బంకువాడు.

అడిగినవాళ్ళకి వృత్తాంతాల్ని చెప్తన్నారు.

ఓ పోలీసు అటువైపు వెళుతుంటే పెద్దమనిషి పిలిచాడు. మా నె య్య ము ఖం విప్పారింది. (ఈ మధ్య మానెయ్యకూడా యితర రిక్షావాళ్ళ సావాసంతో ఖట్‌మల్ అనీ, మామఅనీ వెక్కిరించినవాడే) దగ్గరికి రాగానే కావలించుకున్నంత పనిచేసి జరిగింది మళ్ళీ చెప్పాడు. వర్ణించాడు. తిట్టాడు-న్యాయాన్ని తిడుతున్నాడు దేవుణ్ణి కూడా వోసారి.

కథని రెండోసారి వినేవాళ్ళు వెళ్ళిపోతున్నారు. తప్పుకపోతున్న జనంలో వ్యాఖ్యానాలు అతిశయించాయి.


మోక్షప్రాప్తికి
శ్రీరామకోటి
వ్రాయండి:
మంచి కాగితంపై చక్కని ఆఫ్‌సెట్ ముద్రణతో లక్ష నామముల పుస్తకములు ఐదింటికి రు. 11 లు ఈ క్రింది అడ్రసుకు ఎం. ఓ. చేసిన రిజిస్టర్డ్ డెలివరీ పోస్టులో పంపగలము.
శ్రీ గిరిజా&కో., విజయవాడ-1.



తెల్ల వెంట్రుకలు
వేలాది వన మూలికలతో తయారు చేయబడిన మా స్పెషల్ సుగంధ తైలం వలన తెల్ల వెంట్రుకలను మొదళ్ళనుంచి పూర్తిగా నల్లబరచును. మరియు భవిష్యత్తులో కూడ నల్ల వెంట్రుకలే వచ్చును. మీరు కూడా తైలం ఉపయోగించి తమ వెంట్రుకలను నల్లబరచుకోండి. మూడు సీసాలఖరీదు పూర్తికోర్సు రూ. 30/-లు.
BIMALA AYURVED BHAWAN
P.o. Lal Bigha (GAYA)





"వీళ్ళలో యూనిటీ లేదండీ! ఇదే ఆటోవాళ్ళయితేనా సిటీ సిటీ అంతా యేకం చేస్తురు"— వొక లోకజ్ఞుడు.

"ఈ అసంఘటిత రంగం యింతే" — వో మేధావి, ఏకాకి.

* * *

పోలీసు కథ అంతా విన్నాడు. ఈ లోపున ఇద్దరు ముగ్గురు "యవ్వన దాదాలు" (అంటే యవ్వనంలో ఉన్న బస్తీగూండాలు అని అర్థం) గుమిగూడారు. కథ వాళ్ళకి చాలా ఆసక్తికరంగా ఉంది.

ఒక దాదా పేరు యాద్‌గీర్ అనుకుందాం (వాళ్ళ దోస్తు పిలిచినటుగా) ఇంకోడి పేరు అనవసరం. ఈ దాదాలు నడిరోడ్లో నిలువుగా నడవగలరు. తలుముకుంటె అమ్మాయిల జాకెట్లను స్పర్శిస్తూ సైకిళ్ళ మీద రంయ్‌మనగలరు. ఓ కొట్లాట జరుగుతుంటే అయాచితంగా ఒకడి పక్షం వహించి రెండోవాణ్ని దంచగలరు. అటువంటి మృగములు నగరములో సర్వసామాన్యము. అటువంటి జాతికి చెందిన యాద్‌గీర్ వో చెయ్యి ఆపద్బాంధవుడైన పోలీసు భుజం మీదగా పోనిచ్చి "మానెయ్య" నడిగాడు.

"నీ పేరేందిర."

"మానెయ్య" దీనంగా చెప్పాడు. నెప్పి యిప్పుడు తగ్గింది. ఇంటికి పోవాలన్న ఆత్రుత యెక్కువుంది. రిక్షా పేటుకిచ్చేయడం అతి ముఖ్యవిషయం అతనికి.

"యాడ తాకిందిర దెబ్బ?"

చూపించాడు మానెయ్య ఆ ప్రదేశాన్ని.

ఒక టే న వ్వు తు న్నా రు వా ళ్ళు. మానెయ్య కర్థం కాలేదు వాళ్ళెందుకు నవ్వుతున్నారో.

"మానెయ్యా! మల్లి సెప్పర యాడ తాకింది" ఈసారి పోలీసోడే అడిగాడు.

"ఈడ దొర"-మళ్ళీ చూ పిం చా డు మానెయ్య. ఎన్నిసారు అ డి గిం చు కొన్నారో! ఎన్నిసార్లు నవ్వారో యాద్‌గీర్ చివరకు యిట్టా అన్నాడు.

"మానెయ్యా! దావాఖానాకి గిట్ల రేబోవ్దూగాని. ఇప్పుడయితె పెళ్ళాం కాడికిబో! యేంది అగర్ - ఒకేల శేతగాకుంటె నా కాడికి పంపెయ్! యేమంటవ్."

ఈసారి పోలీసు విరగబడినవ్వాడు.

పెద్ద మనిషి కూడా నవ్వాడు. ఆయనకు బస్సొచ్చింది.

మానెయ్య నవ్వుల్ని విడదీసుకొని రిక్షా కదిలించాడు. రిక్షాయెక్కాడు.

.... .... .... .... ....

అబ్బా....

వొత్తుకపోతోంది.

తొక్కలేడు.

ఛాదర్‌ఘాట్ వరకూ రిక్షా ఈడ్చుకుపోవాలి మానెయ్య. ★